క్లుప్తంగా

సెక్టార్ సమావేశం

బూర్గంపాడు: ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని, అందుకు ఎన్నికల సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని తహసీల్దార్ రాజారావు అన్నారు. బూర్గంపాడు రైతుబంధు కార్యాలయంలో ఎన్నికల బీఎల్ఓలు, సూపర్‌వైజర్స్, సెక్టార్ ఆఫీసర్స్‌తో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజారావు మాట్లాడుతూ.. ఈ నెలాఖరు వరకు ఓటరు నమోదుకు అవకాశం ఉన్నందున బీఎల్ఓలు ఈ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వసతులపై దృష్టి పెట్టాలన్నారు. ఎన్నికల నియామవళిపై తగు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వివేక్‌రామ్, ఎంపీఓ సునీల్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీ

అన్నపురెడ్డిపల్లి: అంగన్‌వాడీలు విధులను నిబద్ధతతో సక్రమంగా నిర్వర్తించాలని సీడీపీఓ నిర్మలాజ్యోతి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెంట్లం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీఓ సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి, టీచర్లు, ఆయాలకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు ఖచ్చితమైన సమయ పాలన పాటించి, క్రమం తప్పకుండా బాలలు, గర్భిణులకు సరియైన పోషకాహారం అందించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే, కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గంగాజలం, అరుణ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

బాలసానిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

చర్ల: మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నాయకుడు బాలసాని లక్ష్మీనారాయణను చర్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన అనంతరం ఖమ్మం నుంచి బాలసాని స్వగ్రామమైన వెంకటాపురం మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా ఆ గ్రామంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఇర్పా శాంత, మండల కాంగ్రెస్ నాయకులు బండారు రామకృష్ణ, చీమకుర్తి వీరభద్రం, చీమలమర్రి మురళీకృష్ణ, దేవభక్తుని రామకృష్ణలు కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శాసనసభ ఎన్నికలపై చర్చించారు. మాజీ ఎమ్మెల్సీని కలిసిన వారిలో సర్పంచ్ ఎలకం నరేంద్ర, నాయకులు గుండేపూడి భాస్కర్‌రావు, మేడిచర్ల వీరకుబార్, అలవాల బాలు, సుందరి సురేష్, గుండేపూడి సతీష్ కుమార్, పెద్దిరెడ్డి, రత్నాజీ, ఆవుల పుల్లారావు, బూరుగుగడ్డ బసవయ్య, దోమల రవికాంత్, చల్లకోటి వాసు, నాగరాజు, ఇర్రంకి రామారావు, అడబాల సురేష్, కాక నర్సీరత్నం తదితరులున్నారు.

ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ఎన్నిక

కరకగూడెం: ఉమ్మడి మండలాలైన పినపాక, కరకగూడెం ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన మండల అధ్యక్షుడిగా కరకగూడెం గ్రామానికి చెందిన సిరిశెట్టి కమలాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని రాళ్లవాగు వద్ద ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కీసర సుధాకర్ రెడ్డి అధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు వేముల నర్సింహారావు హాజరై మాట్లాడుతూ.. నిరుపేద ఫొటోగ్రాఫర్లను ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. అంతేకాకుండా ఫొటోగ్రాఫర్స్ అందరూ ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీ సభ్యులచేత ప్రమాణస్వీకారం చేయించి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా, పలు మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చెందాలి

భద్రాచలంటౌన్: ఏజెన్సీలోని దళితులు ఓటు బ్యాంకు కాకుండా రాజకీయంగా అభివృద్ధి చెందాలని తెలంగాణ మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి శేఖర్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలపని ఎమ్మెల్యేలను ఓడించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాల, మాదిగల మధ్య చిచ్చు పెడుతున్న రాజకీయ పార్టీలకు వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. సమావేశంలో అర్జున్‌రావు, పాపయ్య, వెంకటేశ్వరరావు, రవిబాబు, ప్రసాద్ కుమార్, రమేష్, ఉమా రమాదేవి, సుజాత, కుమారి, రమణ పాల్గొన్నారు.

కార్మికురాలికి పరామర్శ

భద్రాచలంఅర్బన్: ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీఐటీయూ భద్రాచలం పట్టణ కమిటీ సభ్యురాలు, ఏరియా హాస్పిటల్ పారిశుద్ధ్య కార్మికురాలు గీతను బుధవారం సీఐటీయూ పట్టణ కమిటీ బృందం పరామర్శించింది. మెరుగైన వైద్యం కోసం సంబంధిత డాక్టర్ బాబురావుతో సీనియర్ నాయకులు జీఎస్ శంకర్‌రావు చరవాణి ద్వారా మాట్లాడారు. గీతకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. పరామర్శించిన వారిలో సీఐటీయూ పట్టణ కోకన్వీనర్ మర్లపాటి రేణుక, పట్టణ కోర్ కమిటీ సభ్యులు లక్ష్మణ్, సంతోష్ తదితరులు ఉన్నారు.

ఆధార్ సేవలకు అవస్థలు

- మండలంలో అందుబాటులోలేని కేంద్రం
- మణుగూరు, సారపాకలకు ప్రజల పయనం
- పనులు మానుకొని పడిగాపులు


మణుగూరులోని ఆధార్ కేంద్రం వద్ద బారులు తీరిన ప్రజలు

అశ్వాపురం: ప్రజలకు అన్ని అవసరాలకు ఆధార్ తప్పనిసరి అయింది. ఈ నేపథ్యంలో ఆధార్ సేవల కోసం మండల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలో ఆధార్ సేవల కేంద్రం లేక 24 గ్రామ పంచాయతీల ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్తూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

పిల్లలు, విద్యార్థుల చదువుకు.. అంగన్‌వాడీలు, పాఠశాలల్లో చేరాలన్నా, బ్యాంక్ ఖాతా తెరవాలన్నా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలన్నా ఆధార్ తప్పనిసరి. రేషన్‌కార్డు, ఆయుష్మాన్‌భారత్ దరఖాస్తులకు ఆధార్ అనుసంధానం అవసరం. చౌక దుకాణాల్లో వేలిముద్రలు పడనివారు ఈకేవైసీ కోసం, ఫోన్ నంబర్ లింకు చేయడం కోసం ఆధార్ కేంద్రాలకు వెళ్లాలి. ఆధార్ అనుసంధానం, సవరణలు, కొత్త ఆధార్ కార్డులు పొందేందుకు ఆధార్ కేంద్రాలు కావాలి. ఇలా అనేక సేవలు ఆధార్‌కు ముడిపడి ఉన్నాయి. దీనికోసం అందుబాటులో కేంద్రాలు లేకపోతే పరిస్థితిని దయనీయం. అలాంటి పరిస్థితినే అశ్వాపురం మండల వాసులు ఎదుర్కొంటున్నారు.

తప్పని వ్యయప్రయాసలు..

అశ్వాపురం మండలంలో 24 గ్రామ పంచాయతీలున్నాయి. ఈ పంచాయతీల్లో ప్రజలు కోసం ఇక్కడ ఒక్క ఆధార్ కేంద్రమూ లేదు. గతంలో మండలంలో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో కేంద్రాలు నిర్వహించారు. కొంత కాలం తర్వాత మూసివేశారు. మండల కేంద్రంలోని ఓ మీసేవ కేంద్రం అందుబాటులో ఉండేది. సాంకేతిక కారణాలతో అది కూడా నిలిచిపోయింది. దీంతో ఏడాది కాలంగా మండలంలో ఆధార్ కేంద్రం సేవలు దూరమయ్యాయి. ఈ నేపథ్యంలో సేవల కోసం మండలంలోని 24 గ్రామ పంచాయతీల ప్రజలు మణుగూరు, సారపాక, భద్రాచలం వెళ్లాల్సి వస్తోంది. ఇది దూరాభారంతో కూడుకున్నది. ఆ ప్రాంతాలకు వెళ్లాలంటే రేక్కాడితేనే డొక్కాడని ప్రజలు పనులు మానుకొని ప్రయాణం చేయాలి. వెళ్లాక కూడా పని పూర్తవుతుందా అంటే అదీ లేదు. ఆయా కేంద్రాల్లోని రద్దీ కారణంగా ప్రజలు బారులు తీస్తున్నారు. ఉదయం నుంచి లైన్‌లో పడిగాపులు కాసినా కొందరికి వారి వంతు రాదు. ఆధార్ కేంద్రాల వల్ల టోకెన్ల ద్వారా రోజుకు 50 మంది వరకే సేవలు అందించడంతో ఈ పరిస్థితి దాపురించింది. ఇలాంటప్పుడు అప్పటి వరకు వేచిచూసిన ప్రజలు నిరాశతో వెనుదిరిగిపోయి మళ్లీ మరుసటి రోజు వచ్చి క్యూకట్టాలి. ఇలా రోజులు తరబడి తిరిగి విసుగుచెందిన ప్రజానీకం ఎందరో!. ఈ ఇబ్బందులు తొలగిపోడానికి మండలంలో ఆధార్ కేంద్రం అందుబాటులోకి తీసుకురావాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు స్థానికులు విన్నవిస్తూనే ఉన్నారు. అయినా ఇప్పటివరకు సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ఇప్పటికైనా స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



మండలంలో ఆధార్ కేంద్రం లేక మణుగూరు, సారపాక, భద్రాచలం వెళ్లాల్సి వస్తోంది. అక్కడికి వెళ్లినా జనాలు క్యూలైన్‌లో ఎక్కువగా ఉండి రోజులో 40 నుంచి 50 మందికే చేస్తున్నారు. పనులు మానుకుని వెళ్లినా రోజంతా పడిగాపులు కాసినా పని కావడం లేదు. అధికారులు స్పందించి కేంద్రం ఏర్పాటు చేయాలి.
– దండి రాములు, మల్లెలమడుగు, అశ్వాపురం

ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి



మండలంలో ఆధార్ కేంద్రం లేక ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. ప్రతి పనికి ఆధార్ తప్పనిసరి అయింది. ఆధార్ అనుసంధానం, సవరణలు, కొత్త ఆధార్ కార్డుల కోసం ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి మండలంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి.
– కోలా భాస్కర్, అశ్వాపురం

కలెక్టర్ స్పందించాలి..



మండలంలో ఆధార్ కేంద్రం లేక 24 గ్రామ పంచాయతీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రజల ఇబ్బందులను అధికారులు, అదనపు కలెక్టర్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. జిల్లా కలెక్టర్ స్పందించి ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి.
– ముత్తినేని సుజాత, ఎంపీపీ, అశ్వాపురం

మేనిఫెస్టోతో ప్రజలకు మేలు


ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరురూరల్: సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ మేనిఫెస్టోతో ప్రజలకు మరింత మేలు చేకూరనుందని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. బుధవారం మండలంలోని పలు ప్రాంతాల్లో ఆయన నాయకులతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ అసెంబ్లీ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనను నియోజకవర్గ ఎమ్మెల్యేగా మరోసారి గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కాగా, మండల పరిధిలోని తిర్లాపురం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ కంటెం సురేష్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరగా.. వీరికి ఎమ్మెల్యే రేగా కాంతారావు బీఆర్ఎస్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అప్పారావు, నాగేశ్వరరావు, నవీన్, కృష్ణ, యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని రాజీవ్‌నగర్‌లో బుధవారం సైబర్ నేరాలపై ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించారు. మొబైల్‌ఫోన్లలో వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్లు చేసినప్పుడు ఆధార్‌కార్డు, బ్యాంకు ఎకౌంట్ నంబర్, ఓటీపీ నంబర్లు చెప్పవద్దని చెప్పారు. ఈ సదస్సులో పోలీసులు వెంకటేశ్వర్లు, కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి బుధవారం గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. అశ్వారావుపేటకు చెందిన గుజ్జుల శ్రీను అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై ఏపీలోని జీలుగుమిల్లి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో స్థానిక పేపర్ బోర్డు వద్ద అదుపుతప్పి కింద పడ్డాడు. దాంతో శ్రీను తలకు తీవ్రమైన గాయాలు కాగా సమాచారం అందుకున్న చిట్టితల్లి అంబులెన్స్‌లో ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

ఆయుర్వేద వైద్యశిబిరం

కరకగూడెం: మండల పరిధిలోని అనంతారం గ్రామంలో బుధవారం కరకగూడెం ఆయుర్వేద వైద్యాధికారి సీహెచ్ కుమారస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరం విజయవంతం అయ్యింది. ఈ శిబిరంలో సుమారు 65 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశాకార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేశభక్తిని చాటుకోవాలి

భద్రాచలంఅర్బన్: పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నేడు ఉదయం 9 గంటలకు రక్తదాన శిబిరాన్ని భద్రాచలం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేయనున్నట్లు టౌన్ సీఐ నాగరాజు రెడ్డి బుధవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. పట్టణ యువత పెద్ద ఎత్తున ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసి దేశభక్తిని చాటుకోవాలని ఆయన ఆకాంక్షించారు. రక్తదానంతో మరొకరి ప్రాణాన్ని నిలబెట్టవచ్చని, రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ

బూర్గంపాడు: మండల పరిధిలోని మర్రికుంట యువకులకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం వాలీబాల్ కిట్లు అందజేశారు. బూర్గంపాడు ఎస్సైలు రాజ్‌కుమార్, నాగబిక్షంలు మర్రికుంట యువకులకు వాలీబాల్ కిట్లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత సమయాన్ని సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నతంగా రాణించాలన్నారు. చదువులతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని ఆరోగ్యవంతంగా జీవించాలన్నారు. క్రీడానైపుణ్యాలను పెంచుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చూపాలన్నారు.

ఆదేశాలు బేఖాతర్..


ప్రధాన రోడ్డుపై లారీల్లో సరుకు దిగుమతి చేస్తున్న దృశ్యం

మణుగూరుటౌన్: ఇతర ప్రాంతాల నుంచి ట్రాన్స్‌పోర్టు ద్వారా మణుగూరు పట్టణానికి వచ్చే వస్తువులు రోడ్లపైనే దిగుమతులు చేయొద్దని స్థానిక పోలీసుల నుంచి ఆదేశాలున్నా.. అదే పని చేస్తూ ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మణుగూరు మండల కేంద్రం కావడంతో ఇక్కడకు ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు, విద్య, వైద్యం తదితరాలకు రావడం సర్వసాధారణం. అదేవిధంగా సింగరేణి బొగ్గు తరలింపు, బీటీపీఎస్‌కు వచ్చే ఇతర సామగ్రితో నిత్యం మణుగూరు పట్టణం రద్దీగా దర్శనమిస్తోంది. ఈ నేపథ్యంలో విజయవాడ, హైదరాబాద్ ఇతర ప్రాంతాల నుంచి పలు దుకాణాలకు వచ్చే ట్రాన్స్‌పోర్టులు ఇష్టారాజ్యంగా నడిరోడ్డుపైనే సామాన్లు దిగుమతి చేస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా ఈ నెల 8వ తేదీన 'రోడ్లపైనే దిగుమతులు' అనే కథనం ప్రచురితమైంది. అనంతరం మణుగూరు సీఐ రమాకాంత్ కొందరు ట్రాన్స్‌పోర్టు యజమానులకు పిలిచి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు రాత్రి 10 గంటల తర్వాతే అన్‌లోడ్ చేసుకోవాలని, లేకుంటే ఊరు బయట అన్‌లోడ్ చేసుకుని చిన్న వాహనాల ద్వారా సామాన్లు తెచ్చుకోవాలని సూచించారు. అయినా ట్రాన్స్‌పోర్టు లారీలు మాత్రం ఎప్పుడుపడితే అప్పుడు నడిరోడ్డుపైనే దిగుమతులు చేస్తున్నాయి. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి రోడ్డుపై యథేచ్ఛగా దిగుమతులు చేస్తున్న ట్రాన్స్‌పోర్టులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణం సాగేదెలా?


గుంతలు పడి రాళ్లు తేలిన తాలిపేరు ప్రాజెక్టు మార్గం

చర్ల: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నుంచి లక్ష్మీకాలనీ, దేవానగరం, దోశిళ్లపల్లి మీదుగా తాలిపేరు ప్రాజెక్టు వైపునకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. ఈ రహదారిపై చర్ల నుంచి నిత్యం మండలంలోని లక్ష్మీకాలనీ, దేవానగరం, దోశిళ్లపల్లి. కందిపాడు, చెలిమెల, ఉయ్యాలమడుగు, తిప్పాపురం, రాళ్లాపురం, గోరుకొండ, చెన్నాపురం, ఎర్రంపాడు, బత్తినపల్లి గ్రామాలతో పాటు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, దంతెవాడ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఈ మార్గం గుండానే నిత్యం రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఏళ్ల తరబడిగా ఈ రహదారికి మరమ్మతులు చేపట్టకపోవడంతో పలు చోట్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. బండరాళ్లు బయటకు తేలి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ద్విచక్రవాహనాలు, ఆటోలు అదుపు తప్పి క్రింద పడుతుండగా వాటిలో ప్రయాణించే వారు క్షతగాత్రులవుతున్నారు. ఐదేళ్ల క్రితం చర్లలోని పెట్రోల్‌బంక్ సెంటర్ నుంచి విజయకాలనీ మీదుగా దేవానగరం శివారు వరకు బీటీ రోడ్డు వేసినప్పటికీ ఆ పనుల్లో నాణ్యత కొరవడడంతో అది కూడా పూర్తిగా దెబ్బతిని పలు చోట్ల గంతలమయమైంది. దీంతో పాటు మిషన్ భగీరథ పథకం కింద చేపట్టిన పనుల్లో పలు చోట్ల ప్రధాన రహదార్లపైనే తవ్వి పైపులు వేయడంతో ఆయా ప్రాంతాల్లోనూ పెద్ద ఎత్తున కందకాలు ఏర్పడ్డాయి. ఈ రహదారులపై ప్రయాణం సాగించాలంటే ప్రాణసంకటంగా మారిందని పలువురు వాపోతున్నారు. ఏళ్ల తరబడిగా ఈ రహదారి పరిస్థితి ఇలాగే ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని, ఇకనైనా అధికార యంత్రాంగం స్పందించాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా అమ్మవారి శోభాయాత్ర


ములకలపల్లిలో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు


అశ్వారావుపేటరూరల్: విజయదుర్గా భవాని ఆలయంలో చండీ హోమం

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం క్రాస్ రోడ్డులో దసరా ఉత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు బుధవారం అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఊరేగింపులో మహిళలు అందరూ బతుకమ్మ చీరలు కట్టుకుని నృత్యాలు చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం పలు గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ఘనంగా ఊరేగించారు. మండలంలోని కొత్త మామిళ్లవారిగూడెం, ఊట్లపల్లి, వినాయకపురం, గుమ్మడవల్లి, వడ్డెర రంగాపురం, గాడ్రాల, అనంతారం, నారంవారిగూడెం కాలనీ, అచ్యుతాపురం, అశ్వారావుపేటలో భక్తులంతా కలిసి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, చండీ హోమాలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను ట్రాక్టర్లలో పురవీధుల్లో ఊరేగించి, చెరువుల్లో నిమజ్జనం చేశారు. అలాగే ఆయా మండపాలు, ఆలయాల వద్ద భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు.

ములకలపల్లి: దేవీశరన్నవ రాత్రులు ముగింపులో భాగంగా బుధవారం భక్తిశ్రద్ధలతో అమ్మవారి నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక కమిటీల ఆధ్వర్యంలో మేళతాళాల నడుమ పుర వీధుల్లో దేవీమాతా విగ్రహాన్ని ఊరేగించారు. డీజే శబ్దాలు, తీన్‌మార్ డ్యాన్సులు, యువకుల నృత్యాల నడుమ ఘనంగా నిమజ్జనం చేశారు.

దేవి మండపాల్లో అన్నదానం,,

భద్రాచలంటౌన్: పట్టణంలోని పలు కాలనీల్లోని శ్రీదుర్గా దేవి మండపాలలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కూనవరం రోడ్డులో, తాతగుడి సెంటర్‌లో ఏర్పాటు చేసిన దుర్గా దేవి మండపాలతో పాటు శాంతినగర్ కాలనీలోని లలితా పరమేశ్వరి ఆలయాలలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మండపాల నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యం

చర్లరూరల్: బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా అందరూ కష్టపడాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సోయం రాజారావు కోరారు. బుధవారం ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావును భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో చర్ల మండల ప్రధాన కార్యదర్శి పోలిన లంకరాజు, ఎంపీపీ కోదండ రామయ్య, ప్రచార కార్యదర్శి కోటేరు శ్రీనివాసరెడ్డి, రైతు బంధు సమితి మండల కన్వీనర్ కోసరాజు రాజా, అధికారి ప్రతినిధి ఇరస వడ్ల రాము, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాపుల నాగరాజు, ఎంపీటీసీ మీడియం శోభారాణి, యూత్ అధ్యక్షుడు కాకి అనిల్, మాజీ ఎంపీటీసీ ఆలం ఈశ్వర్, తిప్పాపురం సర్పంచ్ కన్నారావు, ఆర్ కొత్తగూడెం మాజీ సర్పంచ్ తుర్రం రవి, సీనియర్ నాయకులు బ్రహ్మానంద రెడ్డి, ముప్పిడి సోమరాజు, తోటమల్ల రవి, బోళ్ల వినోద్, తడికల బుల్లెబ్బాయ్, కుప్పల నిరంజన్, దుబ్బ సమ్మయ్య, ఆకారపు పవన్, సంతపురి సతీష్, అంబోజి సతీష్, సోమయ్య, పంజా రాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్యం చేయించేందుకు హామీ..

మండలంలోని ఆర్ కొత్తగూడెం గ్రామానికి చెందిన ఆకుల పూజిత గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న భద్రాచలం బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు వైద్యం కోసం ఎటువంటి ఇబ్బంది పడవద్దని, వైద్య ఖర్చులు భరిస్తానని హామీనిచ్చారు.

ఆర్థికసాయం అందజేత


బూర్గంపాడు: విద్యార్థినితో ఆవుల రవీంద్రారెడ్డి, మేడం లక్ష్మీరెడ్డి

ములకలపల్లి: అనారోగ్యంతో మృతి చెందిన బాల్యమిత్రుడి కుటుంబానికి సహమిత్రులు అండగా నిలిచి ఆర్థికసాయం అందజేశారు. మాధారం గ్రామానికి చెందిన కందుకూరి బాబూరావు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ, ఇటీవల మృతి చెందాడు. కాగా చిన్ననాటి మిత్రులు ఔదార్యంలో రూ.19 వేల నగదును బుధవారం మృతుడి భార్య లలిత, పిల్లలు సందీప్, సాధనలకు అందజేశారు. ఈర్ల రామ్మోహన్‌రావు, కీసరి రాములు, వెంకటరమణ, కునుకుంట్ల వెంకటరమణ, రవిబాబు, ప్రసాద్, కవిత తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన పులి ప్రియవర్శిని ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతోంది. చిన్నతనంలోనే ఆమె తల్లిదండ్రులను కోల్పోయింది. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమె చదువులకు ఆర్థిక ఇబ్బందులు ఆటంకంగా మారడంతో అదే గ్రామానికి చెందిన ఆవుల రవీంద్రారెడ్డి, మేడం లక్ష్మీరెడ్డిలు ప్రియవర్శిని ఉన్నత చదువులకు అండగా నిలిచారు. ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువులకు బుధవారం రూ.25వేల ఆర్థికసాయమందించారు. వీరే ప్రియవర్శిని ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి గతం ఆర్థికసాయమందించారు. ఉన్నత చదువులకూ అండగా ఉంటామన్నారు.

కార్మిక వాడల్లో కాంగ్రెస్ ప్రచారం

మణుగూరుటౌన్: మండలంలోని కూనవరం పంచాయతీతో పాటు పీవీకాలనీలో ఏరియాలోని కార్మిక వాడల్లో మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గడప గడపకూ కాంగ్రెస్ ప్రచారం నిర్వహించారు. కార్మికులు నివసించే క్వార్టర్లలో కలియ దిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నెరవేర్చబోయే ఆరు గ్యారెంటీలను వివరించారు. పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వైస్ ఎంపీపీ కేవీరావు, ఉప సర్పంచ్‌లు పుచ్చకాయల శంకర్, గోరంట్ల కనకన్న, నాయకులు పప్పుల జాన్, సుబ్బారెడ్డి, మాదాడి రాజేశ్, మధు, పాషా, జగన్, ఆర్ కే రాము, నగేశ్, మహేశ్, మానస, ఆదిలక్ష్మి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యం..

దమ్మపేట: కాంగ్రెస్ పార్టీ గెలుపే ప్రధాన లక్ష్యంగా, ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు జారే ఆదినారాయణ పిలుపునిచ్చారు. బుధవారం దమ్మపేట గ్రామంలోని వివిధ పార్టీలకు చెందిన పలువురికి జారే ఆదినారాయణ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జారే మాట్లాడుతూ... అశ్వారావుపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరైనా వర్గాలకు తావు లేకుండా గెలుపు కోసం కృషి చేయాలని అన్నారు. కాంగ్రెస్‌పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చిన్నశెట్టి యుగంధర్, యర్రగొర్ల రాధక్రిష్ణ, రావు రవిశంకర్, సాయిల నర్సీ, చక్రాల మల్లేశ్వరరావు, రొయ్యల కుమార్, ఈశ్వరప్రగడ భూషణం, శ్రీకాకుళపు సత్యావతి తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

పొంచి ఉన్న ప్రమాదం



పట్టణంలోని మణుగూరు సబ్ డివిజన్ కార్యాలయ సమీపాన ఎస్‌బీఐ ఏటీఎం వద్ద ఉన్న కరెంట్ స్తంభం కింద ఓ చెట్టు విద్యుత్ తీగల వరకు పెరిగింది. చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలకు తాకుతున్నాయి. చెట్టు కొమ్మలు గాలికి అటు ఇటు ఊగితే విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం లేకపోలేదు. జరగకూడని ప్రమాదం వాటిల్లకముందే విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి చెట్ల కొమ్మలను తొలగించాలని, తద్వారా ప్రమాదాన్ని నివారించాలని స్థానికులు కోరుతున్నారు.
– మణుగూరురూరల్

ప్రశ్నించాల్సిన అధికారి: జి.వేణుగోపాల్, విద్యుత్‌శాఖ ఏఈ
ఫోన్ నంబర్: 9440811555